# రెవెన్యూలో 5 వేల
# కొత్త కొలువులు!

## నేరుగా నియామకాల విధానం అమలు

## వీఆర్వో వ్యవస్థ రద్దుతో తలెత్తుతున్న సమస్యలు

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణలో కొత్తగా మరో 5 వేల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రెవెన్యూ శాఖలో ఈ ఉద్యోగాలను కల్పించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ పోస్టుకు జూనియర్ రెవెన్యూ ఆఫీసర్, విలేజ్ రెవెన్యూ సెక్రటరీ వంటి కొన్ని పేర్లను పరిశీలిస్తున్నది. రాష్ట్రంలో మొత్తం 10 వేల 54 రెవెన్యూ గ్రామాలు ఉండగా, సగం గ్రామాలకు ఈ రెవెన్యూ అధికారులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో 5వేల మందికి కొత్తగా ఉద్యోగాలు రానున్నాయి. ఇంకో సగం పోస్టులను ఇప్పటికే ఉన్న ఉద్యోగులతో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది. కొత్త ఉద్యోగాలు కల్పించడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో గ్రామ స్థాయిలో విచ్ఛిన్నమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి గాడిన పెట్టనున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు.దీంతో ఆదిశగా ఇప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. గత >>7

# రెవెన్యూలో 5 వేల కొత్త కొలువులు!

>> ప్రభుత్వం గ్రామ స్థాయిలో వీఆర్వో వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో మండల రెవెన్యూ అధికారులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని రకాల ధృవీకరణ పత్రాలకు క్షేత్రస్థాయిలో అవసరమైన ఎంక్వైరీ చేసే బాధ్యతను కొత్తగా ఏర్పాటు చేయనున్న పోస్టుల డ్యూటీ చార్ట్‌లో చేర్చనున్నట్లు తెలిసింది. గ్రామానికో రెవెన్యూ అధికారి ఉంటే క్యాస్ట్, ఇన్‌కం వంటి సర్టిఫికెట్లతో పాటు పంచనామా, భూముల రికార్డులు, చెట్ల పరిరక్షణ సహా భూ సంబంధిత వ్యవహారాల్లో క్షేత్రస్థాయి విచారణ వంటి బాధ్యతలు కూడా అప్పగించనున్నట్లు సమాచారం. ల్యాండ్ సర్వే రిలేటెడ్ వర్క్స్‌లో అసిస్టెన్స్ చేయడంతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హుల గుర్తింపు, భూ సర్వేకు సహాయకారిగా ఉండటం, విపత్తులు, ఇతర అత్యవసర సర్వీసుల్లో తోడ్పాటు అందించడం వంటి విధులు కూడా ఈ పోస్టుల్లోనే వారికే అప్పగించేలా డ్యూటీ చార్ట్ రూపొందిస్తున్నట్లు సమాచారం. 2020 అక్టోబర్‌కు ముందు గ్రామ స్థాయిలో రెవెన్యూ సేవలు అందించేందుకు గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రెవెన్యూ సహాయక వ్యవస్థలు ఉండేవి. ఈ సేవలు అందించేందుకు గాను రాష్ట్రంలో 25,750 పోస్టులు ఉండేవి. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థలను పూర్తిగా రద్దు చేసింది. వారిని ఇతర శాఖలకు బదలాయించింది. ఫలితంగా గ్రామ స్థాయిలో అనేక సమస్యలు ఎదురైనట్లు ప్రభుత్వం గుర్తించింది. మరోవైపు, క్షేత్రస్థాయిలో పాలనాపరంగా యంత్రాంగానికి వీఆర్వో, వీఆర్ఏలు కీలకంగా వ్యవహరించేవారు. విపత్తుల్లడు, పంట నష్టం అంచనాలు మొదలు ప్రభుత్వ పథకాలకు అర్హుల గుర్తింపు సమాచారం చేరవేతకు మాధ్యమంగా ఉండటం వంటి పనులు చేసే వారు. ప్రధానంగా వీరు ప్రభుత్వ భూములు, చెరువుల రక్షణకు తోడ్పడేవారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేయడంలో భాగంగా కొత్తగా సిబ్బంది నియామకానికి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. డిగ్రీ అర్హత కలిగిన వారిని కొత్తగా క్రియేట్ చేసే పోస్టుల్లో తీసుకోవాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సిసిఎల్‌ఏ నుంచి రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు అందినట్లు తెలిసింది. రానున్న అసెంబ్లీ సమావేశాలలో ప్రభుత్వం కొత్త ఆర్ఓఆర్ 2024 ను చట్టం రూపంలో తీసుకురావాలని భావిస్తున్నది. అప్పుడే గ్రామాలకు రెవెన్యూ ఆఫీసర్లను ఎలా నియమించబోతున్నారనే విషయాన్ని ప్రకటించనున్నట్లు సమాచారం.